
సాక్షి నల్లగొండ

శుక్రవారం । 24 । జనవరి । 2025



జాన్‌పహాడ్ ఉర్సు ప్రారంభం

పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గుసుల్ షరీఫ్ వేడుకతో గురువారం తెల్లవారుజామున ప్రారంభమైంది. - IIలో



రాబోయే కాలం ఎర్రజెండాదే

పాలకుల విధానాలతో విసిగిపోయారని.. రాబోయే కాలం ఎర్రజెండాదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని అన్నారు. - IIలో



యాసంగిలో కూడా బోనస్

యాసంగిలో కూడా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు మంత్రులు ఉత్తమ్, తుమ్మల ప్రకటించారు. - IIలో

న్యూస్‌రీల్

డిండి ఎత్తిపోతలతో జిల్లా సస్యశ్యామలం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : డిండి ఎత్తిపోతల పథకంలో నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లాలో కరువును పార దోలేందుకు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, ఎస్ఎల్ బీసీకి రూ.6,190 కోట్లను కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎదుల రిజర్వాయర్ ద్వారా డిండి, సింగరాజుపల్లి, ఎర్రవల్లి–గోకారం, గొట్టిము క్కల, ఇర్విన్, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్న గూడెం రిజర్వాయర్లను నింపి వచ్చే మూడేండ్ల లో నల్లగొండ జిల్లాలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు లను వేగంగా పూర్తిచేసి నల్లగొండ జిల్లా నుంచి ఫ్లోరైడ్‌ను శాశ్వతంగా తరిమేస్తామన్నారు. నల్లగొండ జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేప డుతున్న ప్రతిపక్షాలు.. పదేళ్లు నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను ఎందుకు పడావు పెట్టారో చెప్పా లని డిమాండ్ చేశారు. ప్రజాప్రభుత్వం రావ డంలో కీలకపాత్ర పోషించిన నల్లగొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రుణం తీర్చుకుం టామని మంత్రి ప్రకటించారు.

డిండి ఎత్తిపోతలకు పరిపాలనా ఆమోదం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : డిండి ఎత్తిపోతల పథకానికి కాం గ్రెస్ ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపిం దని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. బుధవారం దేవర కొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. దేవరకొండ, మును గోడు నియోకవర్గ పరిధిలోని 3 లక్షల ఎకరాల కుపైగా సాగునీరు అందించనున్న డిండి ఎత్తిపోతలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలప డంతోపాటు పరిపాలనా అనుమతులు ఇచ్చిం దన్నారు. రూ.1800 కోట్లతో పరిపాలనా అను మతులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ నంబర్ 11 విడుదల చేసిననట్లు తెలిపారు. రానున్న మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీతో పాటు డిండి ఎత్తిపోతలను పూర్తిచేసి దేవరకొం డ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. సమావేశంలో ఎంపి సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, పున్న వెంకటేష్, నల్లగాసు జాన్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, వడ్త్యా దేవేందర్, సతీష్‌రెడ్డి, పాపానాయక్ తదితరులు ఉన్నారు.

డీఎంహెచ్ఓ తనిఖీ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ సమీపం లోని చర్లపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణుల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించిన ఆయన నేషనల్ హెల్త్ మిషన్, ఇన్‌ఫెర్టిలిటీ కేసులపై సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణు గోపాల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

హోమ్ స్టే నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : గ్రామీణ, గిరిజన, పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల విడిది కోసం హోమ్ స్టే నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం .శివాజీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'ధర్తి ఆబ జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' అనే పథకంలో భాగంగా పర్యాటక, గ్రామీణ గిరిజన ప్రాంతాలకు వచ్చే పర్యాటకు లకు ఇంటిలోనే తాత్కాలిక నివాస యోగ్యం కల్పించే హోమ్ స్టే కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా నివాసం కల్పించడమే కాకుండా వారికి స్థానిక ఆహారం అందించి పర్యాటక అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతోపాటు పర్యాటక ప్రదేశా లు ఉన్న ట్రైబల్ విలేజ్‌లను అభివృద్ధి చేయడం లో భాగంగా హోమ్ స్టే నిర్వహణను ప్రోత్సహి స్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధానాల ప్రకారం తెలంగాణ టూరిజం హోమ్ స్టే ఎస్టా బ్లిష్‌మెంట్ సదుపాయాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. హోమ్ స్టే విధి విధానాలు, ఇతర వివరాలకు www.telangnatourism.gov.in వెబ్‌సైట్‌లో, నల్లగొండ పర్యా టక శాఖ కార్యాలయంలో లేదా 9866919131 ఫోన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

● కమ్మేసిన మంచు దుప్పటి





గురువారం ఉదయం నల్లగొండ పట్టణంలో పానగల్లు రోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్‌పై కమ్మేసిన పొగమంచు, మంచు కారణంగా నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనాలు

సమ్మర్.. పవర్‌ఫుల్!

రూ.50 కోట్లతో విద్యుత్‌శాఖ యాక్షన్ ప్లాన్

- 33 కేవీ, 11 కేవీ లైన్లు.. ఓవర్ లోడ్ తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు
- వ్యవసాయ, గృహ అవసరాలను తీర్చేలా ప్రణాళిక



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వేసవిలో నిరంత రాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు జిల్లా విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేయనుంది. వేస విలో కరెంట్ సరఫరాలో ఇబ్బందులతో రైతులు, గృహ, వాణిజ్య పరమైన వినియోగదారులు ఇబ్బం దులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌పీడీ సీఎల్ సీఎండీ ఆదేశాలతో ప్రణాళికలు రూపొం దిస్తోంది. రూ.50 కోట్లతో విద్యుత్ సరఫరాను మెరుగు పరిచే చర్యలకు శ్రీకారం చుట్టింది.

ఓవర్ లోడ్ తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలో కొత్తగా ఇళ్లు కట్టుకుంటున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో కొత్త కనెక్షన్ల అవసరం ఏర్ప డుతోంది. దాంతోపాటు ఇప్పటికే కనెక్షన్లు కలిగిన ప్రజల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. మరోవైపు వేసవి సమయంలో ఇళ్లల్లో ఎయిర్ కండీ షనర్ల వాడకం కూడా పెరుగుతుంది. దీనికి తోడు వ్యవసాయ విద్యుత్ వాడకం.. ఇలా వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగి లోవోల్టేజీ సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితులు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయో అధికారులు గుర్తిం చారు. జిల్లా వ్యాప్తంగా 33 చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచడం, ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లో పనులను పూర్తి చేయగా, ఇంకా 30 ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచడం, అద నపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టబోతోంది.

398 ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు

జిల్లాలో 398 చోట్ల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల వేసవిలో ఇప్పటివరకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గనుంది. ఆయా ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయ నుంది. ప్రధానంగా వ్యవసాయ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధి లైట్లకు సంబంధించి వీటి అవ సరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో ఇప్పటికే 170 ట్రాన్స్‌ఫార్మర్లను బిగించగా, మిగతా వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతు న్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల చాలా వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఇబ్బందు లు కలగవు. వేసవిలో పట్టణ ప్రాంతాల్లో ఏసీల వాడకం బాగా పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వీధి దీపాలతో పాటు గృహాల అవసరాలకు విద్యుత్ వాడకం పెరుగుతున్నందున.. డిస్ట్రిబ్యూ షన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



వేసవిలో విద్యుత్ సర ఫరాలో ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమ లు చేస్తున్నాం. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. వ్యవ సాయ, గృహ, వాణిజ్య పరమైన విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకే రూ.50 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేపట్టాం.

– వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈ

21 ప్రాంతాల్లో 33 కేవీ లైన్లు

జిల్లాలోని 21 ప్రాంతాల్లో 33 కేవీ లైన్లు ఏర్పాటు చేసేందుకు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఆధ్వర్యం లో చర్యలు చేపడుతోంది. ఆ 21 లైన్ల పరిధిలో ఓవర్‌లోడ్‌ను తగ్గించేందుకు ఇంటర్ లింక్ లైన్లు ఏర్పాటు పనులను ప్రారంభించింది. ఇందులో ఇప్పటికే 3 లైన్లను పూర్తి చేయగా, మరో 18 లైన్లకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మరోవైపు 59 ప్రాంతాల్లో 11 కేవీ లైన్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. సబ్‌స్టేషన్ల నుంచి పవర్ బయట ట్రాన్స్‌ఫార్మర్లకు సరఫరా చేసే లైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అందులో ఇప్పటికే 11 ప్రాంతాల్లో పనులను పూర్తి చేయగా, 48 ప్రాం తాల్లో పనులను చేపట్టింది.

ఎల్ఎల్‌బీ రీవ్యాల్యుయేషన్ ఫలితాల్లో తప్పులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మహాత్మాగాంధీ యూని వర్సిటీ నిర్వహించిన ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ రీవ్యాల్యుయేషన్ ఫలితాల్లో తప్పులు దొర్లాయి. మార్కుల వివరాలు తప్పుల తడకగా ఉండటంతో విద్యార్థులు ఆందోళనలో పడ్డారు. యూనివర్సిటీ పరిధిలోని న్యాయ విద్యా కళాశాలల్లో ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ విద్యార్థులకు యూనివర్సిటీ అక్టో బరు నెలలో పరీక్షలు నిర్వహించింది. వాటికి సం బంధించిన ఫలితాలను గతంలో విడుదల చేయ డంతోపాటు రీవ్యాల్యుయేషన్‌కు అవకాశం కల్పిం చింది. దీంతో పలువురు విద్యార్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. దానికి సంబంధించిన ఫలితాలను యూనివర్సిటీ గురువారం ప్రకటించిం ది. అ ఫలితాల షీట్‌లో విద్యార్థులకు వచ్చినట్లుగా చూపించిన మార్కులు ఒక రకంగా ఉండగా, మొత్తం వచ్చిన మార్కుల సంఖ్య మరోరకంగా ఉం డటంతో విద్యార్థులు కంగుతిన్నారు. ఒక విద్యార్థికి రీవ్యాల్యుయేషన్‌లో సబ్జెక్టుల వారీగా చూస్తే 235కి పైగా మార్కులు వచ్చాయి. అయితే అదే మార్కుల షీట్‌లో మొత్తం మార్కులు 440కి పైగా వచ్చినట్లు ఉండటంతో ఇదేంటని ఆందోళనలో పడ్డాడు. ఇలా ఎంతమంది ఫలితాల్లో తప్పులు దొర్లాయో తెలియని పరిస్థితి నెలకొందని విద్యార్థులు పేర్కొ న్నారు. యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఫలితాల్లో ఎలా తప్పులు ఇస్తా రని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని కొందరు విద్యార్థులు యూనివర్సిటీ అధికారుల దృ ష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ ఫలితాలకు సంబంధిం చిన లింక్ అందుబాటులో ఉన్నప్పటికీ హాల్‌టికెట్ నెంబరు ఎంటర్ చేసినా ఫలితాలు వెల్లడి కాకుండా నిలిపివేశారు.

టెక్నికల్ సమస్య వల్లే తప్పులు

టెక్నికల్ సమస్య వల్లే తప్పులు దొర్లాయి. గుర్తించి నిలిపివేశాం. వాటిని సవరించి మళ్లీ ఫలితాలను ప్రకటిస్తాం. 15 మంది విద్యార్థు లు దరఖాస్తు చేసుకుంటే, ఒకరిద్దరి ఫలితాల్లోనే ఈ తేడాలు వచ్చాయి. వాటిని సరిచేస్తాం.

– ఉపేందర్, పరీక్షల నియంత్రణాధికారి

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : జిల్లాలోని వివిధ కోర్టుల్లో పారిశుద్ధ్య (హౌజ్ కీపింగ్) నిర్వహణకు ఆసక్తి గత సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు గురువారం ఒక ప్రక టనలో తెలిపారు. సంవత్సరం కాల పరిమితితో పని నిర్వహించేందుకు ఆయా సంస్థలు జనవరి 31వ తేదీలోగా దరఖాస్తు సమర్పించాలని పేర్కొ న్నారు. పూర్తి వివరాలను www.nalgonda.dcourts.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి ప్రణాళిక



ఛాయా సోమేశ్వర ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న పురావస్తు రాష్ట్ర డైరెక్టర్ కుర్ర లక్ష్మి

రామగిరి(నల్లగొండ) : పానగల్లు ఛాయా సోమేశ్వ రాలయ అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్ కుర్ర లక్ష్మి తెలిపారు. గురువారం ఆమె తన బృం దంతో ఛాయా సోమేశ్వర ఆలయాన్ని సందర్శిం చారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనం తరెడ్డి ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలో ఛాయా సోమేశ్వర ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామ న్నారు. ఆలయ అభివృద్ధికి భూములు కేటాయిం చాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు. కార్యక్రమం లో ఉన్నతాధికారులు నారాయణ, రాములునాయ క్, నాగరాజు, నాగలక్ష్మి, నర్సింగ్ నాయక్, సోమశే ఖర్‌రెడ్డి, కౌన్సిలర్ బుర్రి రజిత యాదయ్య, దేవాదాయ శాఖ ఈఓ బాలక్రిష్ణ ఉన్నారు.

గ్రామసభల్లో దరఖాస్తులు

నల్లగొండ : ప్రజాపాలన గ్రామ, వార్డుసభల్లో గురు వారం జిల్లాలో ప్రజలు దరఖాస్తులు సమర్పిం చారు. రైతు భరోసా పథకానికి 288, రేషన్ కార్డు లకు 15,284, ఇందిరమ్మ ఇళ్లకు 13,000 దరఖాస్తు లు వచ్చినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని పేర్కొన్నారు.

30వ తేదీ వరకు ఆసరా పింఛన్ల పంపిణీ

నల్లగొండ : ఆసరా పింఛన్లను ఈ నెల 30వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలకు సంబంధించిన పింఛన్లను ఆయా పోస్టాఫీస్‌ల వద్ద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బాలికకు భరోసా..

- ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందిస్తున్న పోలీస్‌శాఖ
- అమ్మాయిలపై అఘాయిత్యాల కట్టడి
- నిందితులపై ఫోక్సో, ఇతర చట్టాలపై కేసుల నమోదు
- బాధితులకు అండగా సఖి, భరోసా కేంద్రాలు

2024లోకేసుల వివరాలు

లైంగికదాడి	39
ఫోక్సో	106
మిస్సింగ్	35
మొత్తం	185

నేడు జాతీయ బాలికా దినోత్సవం

నల్లగొండ : బాలికల భద్రతకు పోలీస్ యంత్రాంగం భరోసా కల్పిస్తోంది. ఇటీవల బాలికలపై అఘాయిత్యాలు, దాడులు వం టి సంఘటనలు పెరిగిపోతు న్నాయి. వీటిపై ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు శాఖ స్పందించి వారికి అం డగా ఉంటోంది. బాధితులకు సఖి, భరోసా కేంద్రాల్లో ఆశ్రయం కల్పిస్తూ.. నిందితులపై ఫోక్సో కేసులు నమోదు చేస్తోంది. కొన్ని కేసుల్లో కౌన్సిలింగ్ ఇచ్చి వారిలో మార్పు తీసుకొస్తోంది. మరికొన్ని ఘటనలో కేసులు నమోదు చేసి శిక్షపడేలా చూస్తోంది.

2024లో 180 కేసులు

జిల్లాలో 2024 సంవత్సరంలో బాలికలపై వేధిం పులు, దాడులు, అఘాయిత్యాలు వంటి ఘటన లకు సంబంధించి పోలీసులు, సఖీ కేంద్రం వద్దకు 180 కేసులు వచ్చాయి. ఇందులో 54 మంది బాలికలను రిహ్యాబిటేషన్ సెంటర్‌కు పం పించారు. ఆ బాధితులకు రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం అందజేయనుంది. ఇప్పటికే ముగ్గురు బాదితులకు రూ.15 వేల చొప్పున అం దించింది. 9 మందిని పాఠశాలల్లో చేర్పించారు.

బాలికలపై అత్యాచారాలు

జిల్లాలో బాలికలపై జరిగిన అత్యాచారాలకు సం బంధించి 39 కేసులు నమోదయ్యాయి. బాలిక లను మాయచేసి లోబరుచుకోవడం, బలవం తంగా అత్యాచారాలకు పాల్పడటం వంటి సం ఘటనలు జరిగాయి. దీంతో తల్లిదండ్రుల ఫిర్యా దుతో లైంగికదాడి కేసులు నమోదయ్యాయి.

అనుచిత ప్రవర్తన

జిల్లాలో 106 ఫోక్సో కేసులు నమోదయ్యాయి. బాలికలను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకున్నప్పటికీ అది చట్ట ప్రకారం నేరం. బాలిక, యువకుడు అంగీకారంతో కలిసి ఉన్నా.. నేరమవు తుంది. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించడంగా భావిం చి ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తారు. ఇక ప్రేమ పేరుతో, కొన్ని కార ణాల కారణంగా బాలికలు వెళ్లిపోతే మిస్సింగ్ కేసులు నమోదు చేస్తునారు. ఇలా 2024లో జిల్లాలో 35 మంది బాలికలు మిస్ అయినట్లుగా కేసులు నమోదయ్యాయి. ఈ కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉన్నాయి.

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించొద్దు



బాలికల సంరక్షణ విష యంలో ఎలాంటి సం ఘటనలు చోటు చేసు కున్నా వెంటనే స్పం దిస్తున్నాం. అనుచితంగా ప్రవర్తిస్తే ఫోక్సో కేసులు నమోదు చేస్తున్నాం. చట్టాలపై పాఠ శాల స్థాయిలోనే అవగాహన కల్పిస్తున్నాం. అమ్మాయిలకు ప్రధానంగా గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి స్పష్టంగా తెలియజేస్తున్నాం. ఎవరైనా వేధించినా, ఇబ్బంది పెట్టినా తల్లిదండ్రులు, టీచర్లు, పోలీసులకు, 100 నంబర్‌కు, షీటీమ్‌కు పోన్ చేయాలి. వెంటనే స్పందించి వారికి అండగా నిలుస్తాం.

– శివరాంరెడ్డి, డీఎస్పీ, నల్లగొండ

చట్టాలున్నా ఆగని దాడులు

కఠిన చట్టాలు ఉన్నా.. బాలికలపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు ఆగడం లేదు. కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇందుకు చట్టాలపై పూర్తిగా అవగాహన లేకపోవడం ఒక కారణమైతే, యువత మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు తెలుపస్తోంది. వీటిని అరికట్టాలంటే చిన్న నాటి నుంచే పిల్లల్లో చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. తప్పు చేస్తే శిక్ష పడుతుంది అనే విషయాన్ని పాఠశాల స్థాయి నుంచే తెలియజేయాలి. పిల్లలను సన్మార్గంలో నడిచేలా తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు కఠిన నిబంధనలు అమలు చేయా లని మేధావులు చెబుతున్నారు.

లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ

- జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్

చిట్యాల : సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులంతా పథకాలకు ఎంపికవుతారని రాష్ట్ర మహిళా, శిశు సం క్షేమ శాఖ కార్యదర్శి, నల్లగొండ జిల్లా ప్రత్యే కాధికారి అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో గురు వారం ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరాసా పథ కాల అమలుకుగాను ప్రభుత్వం గ్రామసభలు నిర్వ హిస్తుందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లా డుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సంక్షేమ పథ కాలకు లబ్ధిదారులుగా ఎంపికవుతారని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా, జిల్లా పాలనాధికారిగా మాట ఇస్తున్నానని చెప్పారు. యంత్రాంగానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రావ ణ్‌కుమార్, తహసీల్దార్ క్రిష్ణనాయక్, ఎంపీఓ సత్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి గౌతంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ సర్పంచ్‌లు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, మర్రి జలంధర్ రెడ్డి, లింగస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో కలెక్టర్ ముఖాముఖి

పథకాల అమలుపై గ్రామస్తులు అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ కోరగా.. గ్రామానికి చెందిన గుంటోజు యాదగిరి కలెక్టర్‌ను పలు అంశాలపై ప్రశ్నించగా.. ఆమె సమాధానాలు చెప్పారు.



గ్రామసభలో మాట్లాడుతున్న అనితారామచంద్రన్ పక్కన కలెక్టర్ ఇలా త్రిపాఠి

యాదగిరి : ఒకే ఇంట్లో ఉంటున్న తల్లిదండ్రులతో పాటు వివాహమైన ఇద్దరు కుమారులుంటే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారా?

కలెక్టర్ : ఒకే ఇంట్లో మూడు కుటుంబాలుంటే.. వివాహమైన ఇద్దరు కుమారుల కుటుంబాలకు ఇం దిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం.

యాదగిరి : తల్లిదండ్రుల రేషన్ కార్డులో వివాహమై ఇద్దరు కుమారులుంటే వారికి వేర్వేరుగా రేషన్ కార్డులు ఇస్తారా?

కలెక్టర్ : వివాహమైన ఇద్దరు కుమారుల పేర్లను తల్లిదండ్రుల కార్డుల నుంచి తొలగించి వారికి వేర్వే రుగా రేషన్‌కార్డులను మంజూరు చేస్తాం. రేషన్ కార్డులో కుటుంబసభ్యుల సంఖ్యను కలుపుతాం.. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలి. రేషన్‌కార్డుల మం జూరీకి తహసీల్దార్లకు ఇప్పటికే లాగిన్ ఇచ్చాం.

యాదగిరి : సంక్షేమ పథకాలకు అర్హత ఉండి గ్రామ సభలో లబ్ధిదారులుగా ఎంపిక కాని వారు, వృ త్తిరిత్యా స్వగ్రామంలో ఉండని వారు పథకాలకు దరఖాస్తు చేసుకోడానికి అవకాశం ఉంటుందా?

కలెక్టర్ : అర్హులైన వారు నల్లగొండ జిల్లాలో ఎక్కడ ఉన్నా కలెక్టరేట్, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాల యాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో దర ఖాస్తు చేసుకోవచ్చు.

యాదగిరి : సంక్షేమ పథకాలకు ఎప్పట్టి వరకు దర ఖాస్తు చేసుకోవచ్చు. పథకాలు ఎప్పటినుంచి అం దుతాయి?

కలెక్టర్ : ఈ నెల 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకుంటున్నాం. లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాలేదు. ప్రభుత్వ ఆదే శాల మేరకు లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటిం చిన తర్వాత పథకాలను అమలు చేస్తాం. దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి డెడ్ లైన్‌ను లేదు.



గ్రామస్తుడితో ముఖాముఖి మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో అనితా రామచంద్రన్

క్లుప్తంగా

ఎయిర్ ప్రొడక్ట్ కంపెనీ యజమానిపై కేసు

భూదాన్‌పోచంపల్లి: బాలుడిని పనిలో పెట్టుకొని అతడిచే పనులు చేయిస్తున్న భూదాన్‌పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామపరిధిలోని ఆర్‌వీఆర్ ఎయిర్ ప్రొడక్ట్ కంపెనీ యజమాని శ్యామ్‌సుందర్‌రెడ్డిపై బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆపరేషన్ స్మైల్ టీమ్ ఆకస్మిక తనిఖీలో సదరు కంపెనీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బాలకార్మికుడు పనిచేస్తున్నట్లు గుర్తించారు. దాంతో కంపెనీ యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీశైలం

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామానికి చెందిన మానసిక వికలాంగుడు నెల రోజుల క్రితం అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ గ్రామానికి చెందిన యంపల్ల శ్రీశైలం అనే వ్యక్తి మానసిక వికలాంగుడు. కొన్నేళ్లుగా అతడు ఒక్కోసారి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి 15, 20 రోజులకు తిరిగి వచ్చేవాడు. అయితే నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన శ్రీశైలం తిరిగి రాలేదు. దీంతో 20 రోజుల క్రితం మునుగోడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అతని తండ్రి నర్సింహ తెలిపారు. అయినా నేటికీ ఆచూకీ లభించలేదు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని మునుగోడు పోలీసులు కోరుతున్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి


మహ్మద్ కాశీం సాహెబ్ (ఫైల్)

చిలుకూరు: మండల కేంద్రం సమీపంలోని బేతవోలు క్రాస్ రోడ్డు వద్ద 167 జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన మహ్మద్ కాశీం సాహెబ్(57) కోదాడ నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిలుకూరులోని బేతవోలు క్రాస్ రోడ్డు వద్ద రహదారిని దాటుతుండగా కోదాడ వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో మహ్మద్ కాశీం సాహెబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ కింద ఇరుక్కుపోవడంతో మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మృతుని కూతురు గౌసియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

జాన్‌పహాడ్ ఉర్సు ప్రారంభం

- గుసుల్ షరీఫ్ కార్యక్రమంతో ఉత్సవాలు షురూ
- తొలి రోజు ఉల్సా నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు
- నేడు పవిత్ర గంధం ఊరేగింపు
- హాజరుకానున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


జాన్‌పహాడ్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

పాలకవీడు: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన పాలకవీడు మండలం జాన్‌పహాడ్ సైదులు దర్గా ఉర్సు గుసుల్ షరీఫ్ కార్యక్రమంతో గురువారం తెల్లవారుజామున వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు సుమారు పదివేల మంది భక్తులు దర్గాను దర్శించుకున్నారు. గురువారం తెల్లవారకముందే సంప్రదాయబద్ధంగా దర్గాలోని హజరత్ సయ్యద్ జాన్‌పాక్ షాహిద్ 'రహ్మతుల్లా అలై', సోదరుడు సయ్యద్ మొహినుద్దీన షా సమాధులపై ఉన్న పాతచాదర్, దట్టీలను తొలగించి శుభ్రంచేసి కొత్త చాదర్, దట్టీలు కప్పారు. సువాసనలు వెదజల్లే పూలదండలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఫకీర్లు గాన కచేరీ కొనసాగించారు. అనంతరం ముజావర్‌జానీ ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో నిరంతరం వెలిగే దీపంతోపాటు కొవ్వొత్తులు వెలిగించి ఉల్సా నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు.

అన్ని ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

ఉర్సు ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ శాఖల యంత్రాంగం విధుల్లో పాల్గొన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు స్నానాల గదులు, నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. అనారోగ్యానికి గురైతే మందులు, తక్షణ సాయం కోసం అంబులెన్స్, వైద్యులను నియమించారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఫైర్ ఇంజన్‌ను ఏర్పాటు చేశారు. చెత్తాచెదారం తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఆర్టీసీ జాతర స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు.


భక్తులకు గంధం అందజేస్తున్న ముజావర్ జానీ


దర్గా చుట్టూ పొట్టేళ్లను ఊరేగిస్తున్న భక్తులు

నాంపల్లి దర్గా నుంచి రానున్న పవిత్ర గంధం

ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రధాన ఘట్టమైన గంధం ఊరేగింపు జరగనుంది. ఈ కార్యక్రమాన్ని వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనల నడుమ తయారు చేసిన పవిత్ర గంధాన్ని తీసుకొచ్చి జాన్‌పహాడ్ దర్గా సమీపంలోని చందల్‌ఖానాలో కలుపుతారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై జాన్‌పహాడ్ పరిసర గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. ఊరేగింపు పూర్తి చేసుకున్న అనంతరం గంధాన్ని దర్గాలో బాబా సమాధులపై సమర్పిస్తారు.

ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి

గంధం ఊరేగింపు ఉత్సవానికి రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మంత్రి.. ఉదయం 10 గంటలకు దర్గాకు చేరుకుని చందల్‌ఖానాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఊరేగింపు ప్రారంభిస్తారు. దర్గాను దర్శంచుకుంటారు. తోపులాట జరగకుండా రోప్‌పార్టీ బలగాలు పహారాలో గంధం ఊరేగింపు కొనసాగేలా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



భానుపురి(సూర్యాపేట): జాన్‌పహాడ్ ఉర్సులో గంధం ఊరేగింపు కార్యక్రమానికి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి వెబెక్స్ ద్వారా సంబంధిత అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25వ తేదీల్లో దర్గాకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గంధం ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు స్వగ్రామానికి రవితేజ మృతదేహం

- అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతిచెందిన కొయ్యలగూడెం యువకుడు

చౌటుప్పల్ రూరల్: అమెరికాలో దుండగుల కాల్పుల్లో గత ఆదివారం మృతి చెందిన చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన యువకుడు కొయ్యడ రవితేజ మృతదేహం రాక కోసం తల్లిదండ్రులు, బంధువులు నాలుగు రోజులుగా ఎదురు చూస్తున్నారు. రవితేజ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడం కోసం ఆర్‌కే పురం కార్పొరేటర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి చొరవ తీసుకుని దేశ హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిఫార్సుతో ప్రయత్నాలు చేస్తున్నారు. మన దేశ కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి డెడ్‌బాడీని ప్యాక్ చేసే ప్రక్రియ ముగుస్తుంది. అయితే డెడ్ బాడీని అమెరికాలోని ఎంబసీ వద్దకు తీసుకొచ్చి అక్కడ ఉన్న మృతుడి సోదరి శ్రేయ, బంధువు జశ్వంత్‌లకు చూపించి అనంతరం డెడ్‌బాడీని భారత దేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. భారత కాలమానం ప్రకారం శనివారం తెల్ల వారుజామున హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు వచ్చే అవకాశం ఉందని మృతుడి బంధువులు, భారత ఎంబసీ అధికారులు చెబుతున్నారు. మృతదేహాన్ని ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా మృతుడి స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి తీసుకురానున్నట్లు సమాచారం. శనివారం తెల్లవారుజామున మృతదేహం స్వస్థలానికి చేరుకుంటే సాయంత్రానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

రూ.1.40 లక్షల నగదు అపహరణ

హుజూర్‌నగర్: ఒక రైతు మోటార్ సైకిల్ ట్యాంక్ కవర్ జిప్‌లో పెట్టిన రూ.1.40 లక్షల నగదును గుర్తు తెలియని దొంగలు అపహరించుకెళ్లారు. ఈ సంఘటన గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామానికి చెందిన కనుకుంట్ల రామయ్య హుజూర్‌నగర్‌లోని యూనియన్ (ఆంధ్ర) బ్యాంకులో కుదువ పెట్టిన బంగారం విడిపించుకునేందుకు రూ.1.40 లక్షల నగదు తీసుకుని బ్యాంకుకు వెళ్లాడు. కాల పరిమితి తీరనందున ఆ డబ్బులు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని పోంచర్ల వైన్ షాప్ ఎదురుగా బండి ఆపి పక్కకు వెళ్లి వచ్చేసరికి ఎవరో గుర్తు తెలియని దొంగలు మోటార్ సైకిల్ జిప్‌లోఉన్న డబ్బులు దొంగలించుకెళ్లారు. బాధితుడు రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమీకృత సాగు పద్ధతులు పాటించాలి


రైతులకు జీవ ఎరువులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణరెడ్డి, శాస్త్రవేత్తలు

గరిడేపల్లి, పెన్‌పహాడ్: సమీకృత వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా షెడ్యూల్డ్ కులాలు రైతులు అధిక దిగుబడులతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని కేవీకే ఇన్‌చార్జి, సీనియర్ సైంటిస్ట్ నరేష్, కేవీకే బోర్డు డైరెక్టర్ డాక్టర్ జి.సత్యనారాయణరెడ్డి, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకేలో షెడ్యూల్డ్ కులాలు సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎంపిక చేసిన రైతులకు గురువారం జీవ ఎరువులను పంపిణీ చేసి మాట్లాడారు. అలాగే పెన్‌పహాడ్ మండలం దుపహాడ్ గ్రామంలో ఐసీఏఆర్ భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ, సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో వరిలో డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులు, డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, నరేష్, ఆదర్శ్, రైతులు నాగశేఖర్, సైదులు, వెంకన్న, ఉప్పయ్య, దుపహాడ్ రైతులు దొంగరి అరవింద్, సైదులు, రాములు పాల్గొన్నారు.

వృద్ధుడు బ్రెయిన్‌డెడ్.. అవయవాలు దానం


బంటు అంజయ్య (ఫైల్)

కట్టంగూర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన వృద్ధుడు బుధవారం రాత్రి బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందగా ఆయన అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి మాణిక్యాలమ్మగూడేనికి చెందిన బంటు అంజయ్య(62) ఈనెల 14న ఉదయం సైకిల్‌పై వ్యవసాయబావి వద్దకు బయలుదేరాడు. జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి వైపు నుంచి కట్టంగూర్ వైపు వస్తున్న ద్విచక్రవాహనదారుడు మాణిక్యాలమ్మగూడెం వద్ద సైకిల్‌పై వెళుతున్న అంజయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అంజయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించటంతో కుటుంబ సభ్యులు అంగీకారం మేరకు మృతుడి అవయవాలను దానం చేశారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూర్ (ఎస్): ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆత్మకూర్ (ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పసునూటి యాదయ్య (67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అప్పుడప్పుడు చర్చికి వెళ్లి ప్రార్థనలు చేసేవాడు. కాగా గురువారం మధ్యాహ్నం చర్చికి వెళ్లిన యాదయ్య ఎవరూ లేని సమయంలో చర్చిలోనే రేకులకు అడ్డంగా ఉన్న ఇనుప కడ్డీకి ఉరివేసుకొని చనిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం యాదయ్య మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

రాజాపేట: పొగమంచు కారణంగా కారు అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటన రాజాపేట మండలం పొట్టిమర్రి వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఉప్పల శ్రీను తన కుమార్తె పరీక్ష నిమిత్తం వరంగల్‌కు కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున పొట్టిమర్రివాగులో వెళ్తుండగా దట్టమైన పొగమంచు కారణంగా అదుపుతప్పి కల్వర్టులోకి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ జరగకపోవడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది.

చేనేత సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా

- కేంద్ర జౌళిశాఖ డైరెక్టర్ అశోక్‌కుమార్ జైశ్వాల్

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల సంక్షేమానికి అమలు చేయాల్సిన కొత్త పథకాలు, చేనేత సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కేంద్ర జౌళిశాఖ ఆర్థిక వ్యవహారాల డైరెక్టర్ అశోక్‌కుమార్ జైశ్వాల్ అన్నారు. గురువారం వీవర్ సర్వీస్‌సెంటర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్‌తో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని చేనేత గృహాలను సందర్శించారు. అక్కడ మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్ వస్త్రాలు, రంగులద్దకం, చిటికీ కట్టడం, వార్పు తదితర చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత కార్మికుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. చేనేత కార్మికులు ఆర్థిక పరిపుష్టి సాధించాలంటే ఇంకా ఎలాంటి పథకాలు కావాలని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైతే పోచంపల్లికి మెగా క్లస్టర్ మంజూరుకు పరిశీలిస్తామని అన్నారు. స్టడీటూర్‌లో భాగంగానే పోచంపల్లి సందర్శనకు వచ్చానని తెలిపారు. చేనేత సమస్యలపై నివేదిక తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా టై అండ్ డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ ఆధ్వర్యంలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల డూప్లికేట్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్, చేనేత నాయకులు ముస్కూరి నర్సింహ, గంజి బాలరాజు, వనం దశరథ, గంజి నర్సింహ పాల్గొన్నారు.


మగ్గాలను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్ జైశ్వాల్

యాసంగిలో కూడా సన్నధాన్యానికి బోనస్

- అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇస్తాం
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల

కోదాడ: యాసంగిలో కూడా సన్న ధాన్యాన్ని సాగు చేసే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. గురువారం రాత్రి కోదాడ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వానాకాలం సీజన్‌లో 66.7 లక్షల ఎకరాల్లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిందని, దేశంలో తెలంగాణయే అధిక దిగుబడిని సాధించిందన్నారు. పంట వేసినా, వేయకపోయినా సాగుకు అనువైన ప్రతి ఎకరానికి రైతు భరోసా అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ నెల 26 నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని అర్హులైన చివరి వ్యక్తికి కార్డు అందే వరకు వీటిని జారీచేస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాగానే ప్రతి ఒక్కరికి నెలకు 6 కిలోల సన్న బియ్యం ఇస్తామని అన్నారు. గడిచిన పది సంవత్సరాలలో ఎంత మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు వచ్చాయో అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇంటి కోసం 5 లక్షల రూపాయలు, ఎస్సీ, ఎస్టీలకు 6 లక్షల రూపాయలను అందిస్తామని అన్నారు.

లాభసాటి పంటల వైపు దృష్టిసారించాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని అన్నారు. రైతులు వరి ధాన్యమే కాకుండా లాభసాటిగా ఉండే ఇతర పంటల సాగు వైపు దృష్టి సారించాలని కోరారు. ఆయిల్‌పాం సాగు వల్ల రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. వ్యవసాయ మార్కెట్లు రైతులకు చేదోడుగా ఉండాలని కోరారు. అంతకు ముందు కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా ఏపూరి తిరుపతమ్మసుధీర్, వైస్ చైర్మన్‌గా ఎస్ బషీర్‌తో పాటు ఇతర పాలకవర్గ సభ్యుల చేత మార్కెట్ కార్యదర్శి రాహుల్ ప్రమాణం చేయించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవేటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్


మిర్యాలగూడలో పట్టుబడిన టిప్పర్

మిర్యాలగూడ: శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి నకిలీ వే బిల్లుతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను టిప్పర్ డ్రైవర్ల అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం నుంచి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెంలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులకు అనుమతితో ఇసుక తరలింపునకు కొందరు టిప్పర్ల డ్రైవర్లు వే బిల్లు తీసుకున్నారు. ఇదే ముసుగులో వంగమర్తి ఇసుక రీచ్ నుంచి మిర్యాలగూడకు 47టన్నుల సామర్థ్యం ఉన్న టిప్పర్ వాహనంలో 64 టన్నులకు పైగా ఇసుకను నింపి తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక టిప్పర్ డ్రైవర్ల అసోసియేషన్ ప్రతినిధులు మిర్యాలగూడలో ఇసుక టిప్పర్‌ను అడ్డుకుని రవాణా, పోలీస్ అధికారులకు అప్పగించారు. ఎంవీఐ వీరస్వామి ఆధ్వర్యంలో టిప్పర్ కాగితాలతోపాటు వే బిల్లులను తనిఖీ చేసి పరిమితికి మించి ఇసుకను తరలిస్తున్నందున వాహనాన్ని సీజ్ చేశారు. ఇదిలా ఉంటే ఇసుక టిప్పర్ల అసోసియేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా నిబంధనలకు విరుద్ధంగా వంగమర్తి నుంచి ఇసుక తరలించడాన్ని ఖండిస్తూ అసోసియేషన్ ప్రతినిధులు మిర్యాలగూడలో నిరసన వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో సంఘం అధ్యక్షుడు వసీం, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీకాంత్, సాయి, నాగరాజు, కోటేష్, కృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ రిమాండ్

- 13 తులాల బంగారం, కిలో వెండి, రూ.17వేల నగదు స్వాధీనం

కోదాడ రూరల్: మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా బడవై గ్రామానికి చెందిన నాసు నావెల్ గురువారం కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా నెల రోజుల వ్యవధిలో కోదాడలోని గోల్డెన్ సిటీ కాలనీలో ఓ ఇంట్లో , ఏపీలోని ఏలూరు రూరల్, బొమ్మూరు, తూర్పుగోదావరి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. గోల్డెన్ సిటీ దొంగతనం కేసులో రూ.17,780, గోదావరి జిల్లాలకు సంబంధించిన దొంగతనాల కేసుల్లో అతని వద్ద నుంచి 13 తులాల బంగారు, కిలో వెండి, 10 వాచ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై మధ్యప్రదేశ్‌లో కూడా 10కిపైగా దొంగతనాలు, ఓ రేప్ కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడని సీఐ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, సతీష్‌నాయుడు, ఎల్లారెడ్డిలను సీఐ అభినందించారు.

పశువుల దొంగ అరెస్ట్

తిప్పర్తి: పశువుల దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన తిప్పర్తి మండలం దుప్పలపల్లిలో చోటుచేసుకుంది. తిప్పర్తి ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న తిప్పర్తి మండల కేంద్రంలో రొట్టెల జానయ్యకు చెందిన రూ.1.60లక్షల విలువైన రెండు ఎద్దులను ఇంటి ముందు కట్టేయగా వాటిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో బాధితుడు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా గురువారం దుప్పలపల్లి గ్రామం వద్ద అనుమానాస్పదంగా నిసాన్ కారులో తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు ఆపి విచారించగా అసలు నిజం బయట పడింది. ఇదే కారులో అమీర్ ఖురేషి పాటు మహ్మద్ జమీల్ ఖురేషి, సయ్యద్ రఫీయుద్దీన్ ముగ్గురు కలిసి ఆరు నెలలుగా తిప్పర్తి, కట్టంగూర్, నార్కట్‌పల్లి పరిధిలోని రహదారుల వెంట ఉన్న గ్రామాల్లో పశువులకు మత్తు మందు ఇచ్చి సెవెన్ సీటర్ కారులో వెనుక కుక్కి అపహరించుకెళ్తున్నారు. వీటిని హైదరాబాద్‌లో వధించి కిలోల చొప్పున మాంసం విక్రయిస్తూ లాభం పొందుతారని పట్టుబడిన నేరస్తుడు అమీర్ ఖురేషి ఒప్పుకున్నారు. అతడి నుంచి నిస్సాన్ కారు, రెండు ఎద్దులు, మత్తు మందు బుడ్డి, సిరంజి, రూ.1.60 లక్షలు రికవరీ చేసి అమీర్ ఖురేషిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మిగతా నేరస్తులైన జమీల్ ఖురేషి, సయ్యద్ రఫీయుద్దీన్‌లు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రాబోయే కాలమంతా ఎర్రజెండాదే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం తదితరులు

మిర్యాలగూడ: పాలకుల విధానాలను చూసి ప్రజలు విసిగిపోయారని.. రాబోయే కాలమంతా ఎర్రజెండాదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రాపురంలోగల గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహావిష్కరణకు ఆయన హాజరయ్యారు. ముందుగా ఈదులగూడెంలోని సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే సీపీఎం జెండాను కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆవిష్కరించారు. అక్కడి నుంచి రామచంద్రగూడెంలోని గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గాదె శ్రీనివాస్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు. పేదల కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని గుర్తు చేశారు. ఈ నెల 25 నుంచి 28వరకు సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, నారి ఐలయ్య పాల్గొన్నారు.

దాబాల వద్ద ఘర్షణ.. కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం స్టేజీ వద్ద ఉన్న దాబాల్లో ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద జాతీయ రహదారి 65పై మైదాబా, స్వాతి దాబాలు పక్కపక్కనే ఉన్నాయి. రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి దాబాలోకి ఆహ్వానించేందుకు స్వాతి దాబా యాజమాని గుజ్జ శ్రీనివాస్ అనే వ్యక్తిని రోడ్డుపై ఉంచాడు. పక్కనే ఉన్న మైదాబా యాజమాని బిహార్‌కు చెందిన పవన్ తన దాబాలోకి వచ్చే గిరాకీని ఎందుకు తీసుకెళ్తున్నావంటూ శ్రీనివాస్‌పై కర్రతో దాడి చేశాడు. దీంతో ఇరు దాబాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో దాబాల వద్దకు వెళ్లి ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. గుజ్జ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పవన్ అతని భార్య సీమపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.